క్లుప్తంగా

అమ్మవారికి సారె సమర్పణ


మావుళ్లమ్మకు సారె సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీ మావుళ్లమ్మ తల్లికి శనివారం భీమవరం మోటార్ సైకిల్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘం వారు సారె సమర్పించారు. ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి, నగేష్ ప్రసాదం అందజేశారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 13 మంది ఎంపిక


క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికైన డీఎన్నార్ విద్యార్థులు

భీమవరం (ప్రకాశంచౌక్): డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏబీసీ పాండా సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో తమ కళాశాలకు చెందిన బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న 13 మంది విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యన్నారాయణ రాజు (బాబు) తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను కళాశాల కార్యదర్శి గాదిరాజు బాబు, ప్రిన్సిపాల్ ఎం.అంజన్ కుమార్ అభినందించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డా.రాంకిషోర్, టీపీఓ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్, డీన్, హెడ్స్ బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం: మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవ రావు హెచ్చరించారు. శనివారం స్థానిక భీమవరం మునిసిపల్ ఆఫీసు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ మునిపాలిటీ ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు గత సమ్మె ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన సమ్మె నోటీస్ మునిసిపాలిటీ మేనేజర్‌కు అందజేశారు. ధర్నాలో యూనియన్ నాయకులు నీలాపు రాజు, బంగారు వరలక్ష్మి, నీలపు అప్పన్న, దానాల చిన పెద్దిరాజు మాడుగుల రత్నం తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తుల బైండోవర్

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పాలకోడేరు మండలానికి చెందిన నలుగురు పాతనేరస్తులను బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.బాలరామరాజు తెలిపారు. కె.ఏసుపాదం, లక్ష్మీగణేష్, తాతాజీరావు, రాజేశ్వరరావులను తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశామని, ఏడాది కాలంలో ఎక్సైజ్ నేరాలకు పాల్పడి దొరికితే ఉల్లంఘనల కింద రూ.లక్ష జరిమానా విధించడం జరుగుతుందన్నారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో ఓపెన్ జిమ్ ప్రారంభం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పూర్వ విద్యార్థి మంతెన బాలకృష్ణ వర్మ ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్‌ను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. కళాశాల సెక్రటరీ కం కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ మాట్లాడుతూ పూర్వ విద్యార్థి బాలకృష్ణ వర్మ కళాశాలలో జిమ్ ఏర్పాటు చేయడంపై అభినందించారు. అనంతరం ఆయన్ను ఘనంగా సత్కరించారు. కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీ రంగరాజు డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీ కృష్ణంరాజు, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీహెచ్ దిలీప్ చక్రవర్తి, బాలకృష్ణ వర్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సత్కారం


ఉద్యోగులను సత్కరిస్తున్న దృశ్యం

ఆకివీడు: మండలంలోని చెరుకుమిల్లి గ్రామ సచివాలయ సిబ్బంది ఇంజనీరింగ్ అసిస్టెంట్ పవన్, అగ్రికల్చరల్ అసిస్టెంట్ రాంప్రసాద్, ఏఎన్ఎం కృప బదిలీపై వెళ్లగా, ఆశ వర్కర చుక్కా దయామణి ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా శనివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నందమూరి ప్రకాశం, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సైదాల సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దాట్ల బోసురాజు, ఎరిచర్ల సాంబర్లిన్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం బదిలీపై వచ్చిన వారికి కూడా స్వాగత సత్కారం చేశారు.

ఇష్టారాజ్యంగా మద్యం విక్రయాలు


పాలకోడేరులో మండలంలో మద్యం దుకాణం


మోగల్లు మద్యం దుకాణం

అధిక ధరలకు అమ్ముతున్నారని మందుబాబుల ఆందోళన

పాలకోడేరు: మండలంలో మద్యం అమ్మకాలు ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నాయి. మద్యపాన ప్రియుల బలహీనతలను ఆసరా చేసుకుని బ్రాందీ షాపు యజమానులు అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రేట్ల కన్నా అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో ఒకలా, రాత్రి సమయాల్లో మరొకలా రేట్లు పెంచి అమ్మకాలు కొనసాగిస్తున్నారు. పాలకోడేరు మండలం మోగల్లు గ్రామంలో మరింత విచ్చలవిడిగా, అడ్డూ అదుపూ లేకుండా అమ్మకాలు సాగిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులకు మామూళ్లు అందుతున్నందు వల్లనే ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదేమో అని మందుబాబులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని, ప్రభుత్వ రేట్లకే మద్యాన్ని విక్రయించాలని కోరుతున్నారు. దీనిపై ఎక్సైజ్ శాఖ సీఐ బలరామరాజు వివరణ కోరగా ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించేలా చర్యలు తీసుకున్నామని బదులిచ్చారు.

మా బలహీనతను క్యాష్ చేసుకుంటున్నారు



కూలి నాలి చేసుకునే జీవిస్తున్నాము. ఒళ్లంతా నలిగి కాస్త ఉపశమనం కోసం మద్యం కొనుగోలు చేస్తుంటే మా కష్టాన్ని దోచుకుంటున్నారు. క్వార్టర్ బాటిల్ ఎమ్మార్పీ ధర కంటే అధికంగా రూ.10 నుంచి రూ.20 పెంచి అమ్ముతున్నారు.

ఉన్నమట్ల రమేష్, మోగల్లు

ధరలు కట్టడి చేయాలి

ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు మద్యం అమ్ముతున్నారు. ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి. నైట్ పాయింట్ పేరుతో రాత్రి 10 దాటిన తర్వాత తెల్లవార్లు అధిక ధరలు వసూలు చేస్తున్నారు.

గిరబాబు, మోగల్లు

బంగారం గొలుసు చోరీపై కేసు నమోదు

భీమవరం(ప్రకాశం చౌక్): బంగారం గొలుసు చోరీపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల ప్రకారం భీమవరం రెండో పట్టణానికి చెందిన పలివేల కృష్ణ ఈనెల 14 తేదీన మూడు కాసుల బంగారం గొలుసును బ్యాంకులో పెట్టేందేకు ఆటోలో వెళ్లాడు. తీరా ఆటో దిగిన తరువాత గొలుసు కనిపించ లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై పి.రెహమాన్ తెలిపారు.

సీఎస్ఐ కౌన్సిల్ సభ్యుడిగా హ్యాట్రిక్ సాధించిన సాంబర్లిన్

ఆకివీడు: చెరుకుమిల్లి గ్రామంలోని పరిశుద్ధ పౌలు దేవాలయం(సీఎస్ఐ) చర్చి కౌన్సిల్ సభ్యుడి ఎన్నిక శనివారం ప్రతిష్టాత్మకంగా జరిగింది. ఎన్నికలో 100 మంది సభ్యులు ఓటు హక్కు వినియోగించుకోగా మూడవ సారి కూడా ఎరిచర్ల సాంబర్లిన్ విజయం సాధించి కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. చర్చి భవన నిర్మాణానికి దాతల నుంచి విరాళాలు సేకరించడంలో ఆయన విశేషంగా కృషి చేశారు. ఎన్నికలో విజయం సాధించిన సాంబర్లిన్‌కు ధ్రువీకరణ పత్రాన్ని చర్చి పాస్టర్ జయపూర్ణ అందజేశారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి


మోషేన్‌రాజు కలిసిన వీరవాసరం మండల నాయకులు

వీరవాసరం: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మారంపూడి సురేష్ కుమార్, టీయూసీ అధ్యక్షుడు గెడ్డం మునలయ్య, దళిత నాయకులు శనివారం శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, పార్టీ భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి చినమిల్లి వెంకటరాయుడుని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మోషేన్‌రాజు, వెంకటరాయుడు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకులు నేతల జ్ఞాన సుందర్ రాజు, వీరవాసరం సర్పంచ్ చికిల్ మంగ తాయారు, వీరవాసరం మండలం ఉపాధ్యక్షుడు బొంతు రమేష్, నాయకులు గోడి షణ్ముఖరావు, పరువు వెంకటేశ్వరావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పాలమూరి బుల్‌రాజు, పత్తుల టైసన్, చొప్పల బాబ్జి, చిన తాతారావు, నల్లమిల్లి రామకృష్ణ, అల్లరాజు, మేడే నరేష్, మండల వెంకట నరసయ్య, కె కిషోర్, బొబ్బనపల్లి యూత్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో పూర్వ విద్యార్థుల రజతోత్సవం


వేడుకల్లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 1996– 2000 బ్యాచ్ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు రజతోత్సవ వేడుకలు నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ మాట్లాడుతూ తమ విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉండటం తమకు ఎంతో గర్వకారణం అన్నారు. ఇతర దేశాల నుంచి రాలేని కొందరు విద్యార్థులు ఆన్‌లైన్‌లో అధ్యాపకులు, సహచర విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీ రంగరాజు, డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ కళాశాల పూర్వ విద్యార్థులు సాధించిన విజయాలు హర్షం వ్యక్తం చేశారు. మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ కే సీతారామరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పూర్వపు మెకానికల్ హెడ్ ప్రొఫెసర్ ఎం జగన్నాథం, డాక్టర్ కే బ్రహ్మరాజు, డాక్టర్ రామ్మూర్తి రాజు, డాక్టర్ సురేష్ బాబు, అలుమిని అసోసియేషన్ చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ వి కే విశ్వనాథరాజు, అలుమిని అసోసియేషన్ అడ్వైజర్ డాక్టర్ జీవీ పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్ పనుల పరిశీలన

ఉండి: బొండాడ మేజర్ డ్రెయిన్‌లో వెలివర్రు వంతెన వద్ద జరుగుతును తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులను ఎస్ఈ పీ నాగార్జునరావు శనివారం పరిశీలించారు. డ్రెయిన్‌లో తూడు చెత్త పనులు పూర్తిస్థాయి పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఉండి ఆక్విడెక్టు, పాముల పర్రు, వెలివర్రు వంతెన, వాండ్రం, కోపల్లె, బొండాడ, ఈలంపూడి గ్రామాల్లో పనులను ఆయన పరిశీలించారు.

కుక్కల బెడద.. అంతటా దడదడ


పాలకోడేరులో గుంపులుగా కుక్కలు

పాలకోడేరు: ఉండి నియోజకవర్గంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గ్రామాల్లో ఏ వీధిలో చూసిన గుంపులుగా శునకాలు సంచరిస్తున్నాయి. పిల్లలు, వృద్ధులపై దాడులు చేస్తున్నాయి. ద్విచక్ర వాహన దారులను వెంబడించి పరుగులు పెట్టిస్తున్నాయి. రాత్రి వేళల్లో మనుషులు కనిపిస్తే చాలు దాడి చేసి గాయపరుస్తున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో ఏదో ఒకచోట చిన్న పిల్లలు, వృద్ధులు మేకలపై కుక్కలు దాడిచేసిన ఘటనలు నిత్యం జరగుతున్నాయి. అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి రక్షించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు

కుక్కకాటుకు వైద్యుడుని సంప్రదించాలి

సాధారణంగా చాలామందిలో వీధి కుక్క కరిస్తేనే రేబిస్ వ్యాధి సోకు తుందన్న భావన ఉంటుంది. కానీ వీధి కుక్కలే కాదు పెంపుడు కుక్కలు కరిచిన రేబిస్ వ్యాధి సోకుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. ఇలా ఏ కుక్క కరిచిన వెంటనే వైద్యుడు వద్దకు వెళ్లి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి. లేనిపక్షంలో కరిచిన ప్రదేశాన్ని బట్టి తలపై కరిస్తే మెదడు దెబ్బతిని పక్షవాతం సోకుతుందని వైద్యులు చెబుతున్నారు. నాలుక, గొంతు పని చేయకుండా ఆహారం తినే అవకాశం లేకుండా పోతుంది. నీరు చూసినా భయపడే పరిస్థితి వస్తుంది. చివరకు చికిత్సకు లొంగకుండా ప్రాణాంతకం అవుతుంది. కరిచింది మన ఇంటి కుక్కే కదా అన్న భావన వీడి తక్షణమే చికిత్స చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పెంపుడు కుక్కలను వీధి కుక్కలతో కలవకుండా యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలి.

కుక్క కరిచిన వెంటనే

కుక్క కరిచిన మరుక్షణం టాప్ వాటర్‌తో డిటర్జెంట్ సోపుతో (బట్టలు ఉతికే సబ్బు తో) గాయమైన చోట శుభ్రం చేయాలి. దీంతో 90% వైరస్ సోకకుండా ఉంటుంది. గాయానికి కట్టు కట్టకూడదు. రక్తం పోతుందని కట్టు కడితే వైరస్ మరింత వ్యాపించే ప్రమాదం ఉంది. వెంటనే డాక్టర్ను సంప్రదించాలి. కుక్క కరిచిన చోట, విధానం, రేబిస్ కుక్క అయితే దానిని బట్టి ఐదు నుంచి 7 ఇంజక్షన్లు వేస్తారు. పిచ్చికుక్క కరిస్తే దానికి హిమినోగ్లోబిన్ ఇంజక్షన్ వేయించుకోవాలి. ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంజక్షన్ అందుబాటులో ఉంటుంది.

నిర్లక్ష్యం చేయొద్దు



కుక్క కరిచిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్ ను సంప్రదించి వ్యాక్సిన్ వేయించుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికే ముప్పు. పెంపుడు కుక్క అయినా, వీధి కుక్క అయినా వ్యాక్సిన్ వేయించుకోవాల్సిందే. కనీసం ఐదు నుంచి ఏడు ఇంజక్షన్లు వేయాల్సి ఉంటుంది. నెలకు 10 నుంచి 20 మంది కుక్క కాటుకు గురై ఆసుపత్రికి వస్తున్నారు

– గులాబ్ రాజ్ కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి, పాలకోడేరు

దూడలు, మేకలపై కూడా దాడి చేస్తున్నాయి



ఎక్కడ చూసినా కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. దూడలు, మేక పిల్లలపై దాడులు చేస్తున్నాయి. రెండు రోజులు క్రితం చిన్న పిల్లలపై దాడి చేశాయి. మేక పిల్లలను బయట వదిలేందుకు భయంగా ఉంది.

– కె దావీదు కుముదవల్లి

వీధుల్లో తిరగాలంటే హడల్



చిన్న పెద్ద తేడా లేకుండా అందరినీ కుక్కలు కరుస్తున్నాయి పిల్లలు స్కూల్‌కి వెళ్లాలన్నా, ఆటలు ఆడుకునేందుకు వీధిలో పిల్లలను వదలన్నా భయంగా ఉంది వీధి కుక్కలు ఎక్కడ కరుస్తాయో అని భయం వేస్తోంది. ఇటీవల పాఠశాలకు వెళ్లి వస్తుంటే సైకిల్‌పై వచ్చే పిల్లలపై దాడి చేసాయి.

– కె అరవింద్ పాలకోడేరు

100కు పైగా కుక్కలున్నాయి



మోగల్లు గ్రామంలో వందకు పైగా కుక్కలు ఉన్నాయి. పగలు రాత్రి తేడా లేకుండా ఏ సమయంలో దాడి చేస్తాయోనని పిల్లలు, వృద్ధులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు ప్రజాప్రతినిదులు స్పందించి కుక్కల బెడద నుంచి రక్షణకు చర్యలు తీసుకోవాలి.

– కె వై రత్నం. మోగల్లు

అట్టడుగు వర్గాలకూ న్యాయసేవలు అందాలి


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి హనీషా

భీమవరం (ప్రకాశం చౌక్): అన్ని శాఖల నుంచి అధికారులను సమన్వయ పరుచుకుంటూ అట్టడుగు వర్గాలకూ న్యాయ సేవలు, పథకాలు అందేలా చర్యలు తీసుకోవడమే ×జాగృత్తి పథకం ముఖ్యోద్దేశమని 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి.హనీషా అన్నారు. శనివారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ప్రవేశపెట్టిన ×జాగృత్తి పథకంపై సభ్యులకు అవగాహన కల్పించేందుకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి హనీషా మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి ప్రజలను జాగృతి పథకంపై చైతన్యపరచాలన్నారు. జాగృతి టీం సభ్యులు ప్యానల్ న్యాయవాదులు కె.జ్యోతి, పి.అంబేద్కర్, వన్ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగరాజు, టౌన్ స్టేషన్ మేనేజర్ కె.శ్రీనివాస్, స్టేట్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ పి.సతీష్ కుమార్, హెడ్ పోస్టాఫీస్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎస్.వి.భాస్కర్ రాజు, మండల ప్రజా పరిషత్ ఎంఓ ఎస్.రమేష్ నాయుడు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి



మావుళ్లమ్మ ఆలయం వద్ద ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేస్తున్న జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి తదితరులు


ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జి.గీతాబాయి, సిబ్బంది


జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయ ఆవరణలో గుంతలను పూడుస్తున్న అడిషనల్ ఎస్పీ భీమారావు

భీమవరం (ప్రకాశంచౌక్): కలెక్టర్ ఆదేశాలతో గత 6 నెలలుగా జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, నిరంతరం కృషి చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి చెప్పారు. స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో మావుళ్ళమ్మ ఆలయం వద్ద ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వలన కలిగే హాని గురించి, ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ బదులుగా గుడ్డ సంచులను పేపర్ కవర్లను వాడాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నిషేధంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం భీమవరం మావుళ్ళమ్మ గుడి సమీపంలో కొన్ని షాపులు, పండ్ల దుకాణాలను జాయింట్ కలెక్టర్ సందర్శించి షాపుల యజమానులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు గురించి వివరించారు. పట్టణంలో బస్టాండు, కేశవ రావు హై స్కూల్ ప్రాంతాల్లో పింక్ టాయిలెట్లు ఏర్పాటు చేయుటకు జాయింట్ కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ఏ. రాంబాబు, మున్సిపల్ ఇంజనీర్ త్రినాధరావు, తహసీల్దార్ రావి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ ప్రభావాన్ని నియంత్రించడం సాధ్యమే

స్థానిక పొట్టి శ్రీరాములు మెమోరియల్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యార్థులకు భీమవరం రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ ఎం కరుణాకర్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ మార్గాలను విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులచే స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎస్ సురేష్ కుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె రాంప్రసాద్, డీఈవో వై ఆనంద్‌రాజు తోపాటు హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు బి సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ×స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ప్రతి నెలా 3వ శనివారం నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జి.గీతాబాయి సూచించారు. దీనిలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ప్రాంగణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ మార్గాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అనంతరం కార్యాలయ ఉద్యోగులతో ప్రతిజ్ఞ నిర్వహించారు.

పాలకోడేరులో...

పాలకోడేరు: స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వేంద్ర పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు జీవీవీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ గులాబ్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

పారిశుద్ధ్య నిర్వహణ అందరి బాధ్యత

భీమవరం (ప్రకాశంచౌక్): పారిశుద్ధ్య నిర్వహణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, వ్యక్తిగత పరిశుభ్రతే కాకుండా, సామాజిక పరిశుభ్రత కూడా అత్యంత ముఖ్యమని అడిషనల్ ఎస్పీ వి.భీమారావు అన్నారు. శనివారం ×స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయ ఆవరణలో ఏర్పడిన గుంతలను పూడ్చి, చెత్త పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పోలీసు అధికారులకు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎంవీవీ సత్యనారాయణ, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు ఆర్మ్డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకట్రావు పాల్గొన్నారు.

బస్ డిపోలో స్వచ్ఛాంధ్ర

భీమవరం (ప్రకాశంచౌక్): బస్ స్టేషన్, డిపో ఆవరణలో ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో విరివిగా మొక్కలు నాటాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్‌వీఆర్ వరప్రసాద్ సూచించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం న్యూ బస్ స్టేషన్ పరిసరాలు, డీపీటీఓ కార్యాలయం ఆవరణ, గ్యారేజీ ఆవరణను శుభ్రం చేశారు.

నేడు ఆరోగ్యంపై అవగాహన సదస్సు

పాలకోడేరు: పాలకోడేరు వాకర్స్ అసోసియేషన్, ఉషోదయ మహిళ వాకర్స్, మోగల్లు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాలకోడేరు శివారు పెద లోగిల్లు గోస్తని గుడి వద్ద ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల నుండి ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడుగాదిరాజు కృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపులో వర్మ హాస్పిటల్, ఇంపీరియల్ హాస్పిటల్ భీమవరం, లలిత హాస్పిటల్, నరసాపురంనకు చెందిన డాక్టర్లు పాల్గొంటారని, ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని కోరారు.

బీజేపీ జిల్లా నూతన కార్యవర్గం ప్రకటన

భీమవరం (ప్రకాశంచౌక్): బీజేపీ జిల్లా నూతన కార్యవర్గాన్ని భీమవరంలో శనివారం ప్రకటించారు. తొలుత జిల్లా పదాధికారుల సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి బి.శ్రీనివాసవర్మ ప్రసంగించారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి 21 మందితో కూడిన నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. రాష్ట్ర సంఘటన మంత్రి జి.మధుకర్, ఎంపీ పాకా వెంకట సత్యనారాయణ, గోదావరి జోనల్ ఇన్‌చార్జి కాశీ రాజు తదితరులు పాల్గొన్నారు.